పేదల జీవితాలకు జగనన్న భరోసా

పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు



వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో జెండా ఆవిష్కరించిన ఎమ్మెల్యే వెలంపల్లి



47వ డివిజన్‌లో వై ఏపీ నీడ్స్ జగన్ కరపత్రాలతో కార్పొరేటర్ గోదావరి గంగ, పార్టీ నాయకులు



45వ డివిజన్‌లో డిస్ప్లే బోర్డ్‌ను ఆవిష్కరించిన గౌస్ మొహిద్దీన్, మాధురీ లావణ్య

వించిపేట(విజయవాడపశ్చిమ): పేదల జీవితాలకు భరోసా కల్పించే నాయకుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని మాజీ మంత్రి, పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు తెలిపారు. 50వ డివిజన్‌లో సోమవారం నిర్వహించిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో ఆయన పాల్గొని పార్టీ జెండా ఆవిష్కరించారు. అనంతరం వార్డు సచివాలయంలో సంక్షేమ పథకాల లబ్ధిదారుల సంఖ్య, ప్రతి పథకానికి పంపిణీ చేసిన మొత్తాన్ని వివరించేలా సంక్షేమ బోర్డును ఆవిష్కరించారు. నాలుగున్నరేళ్లలో జగనన్న ప్రభుత్వం చేసిన అభివృద్ధిని, సాధించిన విజయాలను ప్రజలకు వివరించే కార్యక్రమమే 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే' అని తెలిపారు. కార్యక్రమంలో దుర్గమల్లేశ్వరస్వామి దేవస్థానం చైర్మన్ కర్నాటి రాంబాబు, వైఎస్సార్ సీపీ 50వ డివిజన్ ఇన్‌చార్జ్ బంక విజయ, నాయకులు పీత మోహనరావు, సైకం సాయిబాబు, బంక శివ, రవూఫ్, కామరాజ్ హరీష్, చాముండేశ్వరి పాల్గొన్నారు.

చంద్రబాబు గ్యారంటీలకు విలువలేదు...

భవానీపురం(విజయవాడపశ్చిమ): వారంటీ లేని చంద్రబాబు ఇచ్చే గ్యారంటీలకు విలువలేదని, అటువంటి వ్యక్తి ఇస్తానంటున్న షూరిటీలు తమకు వద్దని ప్రజలు స్పష్టం చేస్తున్నారని ఎన్టీఆర్ జిల్లా వక్ఫ్‌బోర్డ్ అధ్యక్షుడు షేక్ గౌస్ మొహిద్దీన్ తెలిపారు. తమకు సంక్షేమం, అభివృద్ధి అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తప్ప వేరెవరూ వద్దని ప్రజలు నినదిస్తున్నారని అన్నారు. వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు, పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు ఆదేశాలపై 45వ డివిజన్ విద్యాధరపురం కబేళా రోడ్‌లోగల 137 సచివాలయం పరిధిలో సోమవారం నిర్వహించిన 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమానికి స్థానిక కార్పొరేటర్ మైలవరపు మాధురి లావణ్య అధ్యక్షత వహించగా గౌస్ మొహిద్దీన్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. తొలుత 137వ వార్డ్ సచివాలయ పరిధిలో జరిగిన అభివృద్ధి పనులు, స్థానికులకు అందిన ప్రభుత్వ సంక్షేమ పథకాలకు సంబంధించి వివరాలతో కూడిన డిస్ప్లే బోర్డ్‌ను ఆవిష్కరించారు. అనంతరం పార్టీ జెండాను ఎగురవేశారు. 'మాటల బాబు వద్దు..చేతల సీఎం జగనన్నే కావాలి' అంటూ రాము క్వారీ ప్రజలు నినదించారు. ఈ సందర్భంగా గౌస్ మొహిద్దీన్ మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల్లో మాట తప్పని..మడమ తిప్పని, మనసున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలబడి మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు దుర్వేసుల హుస్సేన్, ముత్యాల రాంబాబు, ముత్తా వాసు, దావాల బుజ్జి, నల్లం వాసు, సుంకర నారాయణ, డబ్బాల రాము, వెంకటరావు, కిరణ్, డి రమేష్, వేణు, గుండు లక్ష్మి, ఆర్ కోటేశ్వరి, భాను తదితరులు పాల్గొన్నారు.

గోదావరి గంగ ఆధ్వర్యంలో....

47వ డివిజన్ కార్పొరేటర్ గోదావరి గంగ ఆధ్వర్యంలో 147వ సచివాలయంలో 'ఆంధ్రప్రదేశ్‌కు జగనన్నే ఎందుకు కావాలి' కార్యక్రమం జరిగింది. సచివాలయ పరిధిలో జరిగిన అభివృద్ధి పనులు, అందిన ప్రభుత్వ సంక్షేమ పథకాలతోకూడిన డిస్ప్లే బోర్డ్‌ను ఆమె ఆవిష్కరించారు. అనంతరం వైఎస్సార్ సీపీ జండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పక్క రాష్ట్రంలో నివసిస్తూ చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని, ఆయన ప్రభుత్వాన్ని విమర్శించే నైతిక హక్కు లేదన్నారు. వాళ్లిద్దరూ తల్లకిందులుగా తపస్సు చేసినా సీఎం జగనన్న మళ్లీ ముఖ్యమంత్రిగా కాకుండా ఆపే దమ్ము, ధైర్యం లేదన్నారు. ముఖ్యంగా చంద్రబాబు అతని దత్త పుత్రుడి మాటలను ప్రజలు విశ్వసించే పరిస్థితి లేదన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ దేరంగుల వెంకట రమణ, ఇలిపిల్లి విజయలక్ష్మి, మద్దిరాల కమలాకర్, 47వ డివిజన్ వైఎస్సార్ సీపీ అధ్యక్షులు కూరాకుల నాగ, శీరం వెంకటరావు, నన్నం దుర్గ, వరకాల జోషి, పగిడిపల్లి పాండు, బోయళ్ల రాజేష్ తదితరులు పాల్గొన్నారు. కాగా దేరంగుల వెంకట రమణ నేతృత్వంలో కార్పొరేటర్ గోదావరి గంగ చేతులమీదుగా మహిళా వలంటీర్లకు నూతన వస్త్రాలను బహూకరించారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు



భవానీపురం(విజయవాడపశ్చిమ): విజయవాడ రూరల్ మండలం గొల్లపూడి గ్రామంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విద్యా అకాడమీ హైస్కూల్‌లో సోమవారం సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. చిన్నారులు మేరీ మాత, ఏంజెల్స్, క్రిస్మస్ తాత వేషాలు ధరించి అందరినీ ఆకట్టుకున్నారు. వారి చేత సెమీ క్రిస్మస్ కేక్ కట్ చేయించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గుంటూరుకు చెందిన విలేజ్ రీ కన్‌స్ట్రక్షన్ ఆర్గనైజేషన్ స్వచ్ఛంద సంస్థ (వీఆర్‌ఓ) 420 మంది విద్యార్థులకు టవల్స్ బహూకరించింది, ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన పాఠశాల కరస్పాండెంట్ ఆర్.సత్యనారాయణ మాట్లాడుతూ వీఆర్‌ఓ సంస్థ హైస్కూల్ అభివృద్ధితోపాటు విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు, బ్యాగ్స్ ఏటా అందిస్తున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. వీఆర్‌ఓ సంస్థ డైరెక్టర్ ఫాదర్ పీటర్ డానియేల్, జాయింట్ డైరెక్టర్ ఫాదర్ వేలంగణి, ప్రెసిడెంట్ టి.గోపాలరావు అందిస్తున్న సహాయ, సహకారాలు మరువలేనవన్నారు. వారి ఆకాంక్ష మేరకు విద్యార్థులంతా క్రమశిక్షణ కలిగి సోదర భావంతో ఐకమత్యంగా ఉంటూ చక్కగా చదువుకోవాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ అంబేడ్కర్ యువజన సంఘం వైస్ ప్రెసిడెంట్ గోపాలం, సెక్రటరీ ఎమ్ నరసింహారావు, ట్రెజరర్ డీ నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సీఎంఆర్‌ఎఫ్ ఎల్వోసీ అందజేత



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని 50వ డివిజన్‌కు చెదిన వనమా కృష్ణ రవితేజ వైద్య ఖర్చుల నిమిత్తం రూ. 3. 30 లక్షలు సీఎం సహాయ నిధి ఎల్‌ఓసి అందించారు. సోమవారం భవానీపురంలోని జిల్లా వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు బాధితుడికి ఎల్‌ఓసీ అందజేశారు. ఈ కార్యక్రమంలో 44వ డివిజన్ కార్పొరేటర్ మైలవరపు రత్నకుమారి పాల్గొన్నారు.

భర్త అదృశ్యంపై భార్య ఫిర్యాదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): పనికి వెళ్లిన భర్త కనిపించడం లేదంటూ భార్య ఫిర్యాదు చేయడంతో కొత్తపేట పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. కొత్తపేట పోతిన ఆదియ్య వీధికి చెందిన విజ్జి నిర్మల, శంకర్ భార్యాభర్తలు. శంకర్ తాపీ పని చేస్తుంటాడు. మద్యం అతిగా తాగే శంకర్ గత నెల 10వ తేదీన పనికని భార్యకు చెప్పి వెళ్లాడు. అయితే శంకర్ అప్పటి నుంచి కనిపించకపోవడంతో బంధువులు, తెలిసిన వారి ఇంట విచారించినా ప్రయోజనం లేకపోవడంతో భార్య నిర్మల పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పార్క్ చేసిన ద్విచక్ర వాహనం అదృశ్యం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): టెంపుల్ వద్ద పార్క్ చేసిన బుల్లెట్ బైక్ అదృశ్యమైన ఘటనపై భవానీపురం పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలు.. విజయవాడ గులాబీతోటకు చెందిన అల్లూరి సునీల్‌కుమార్ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. సోమవారం ఉదయం గొల్లపూడిలోని అయ్యప్పస్వామి టెంపుల్‌లో బంధువుల ఫంక్షన్‌కు తన బుల్లెట్‌పై వచ్చాడు. గుడిలోకి వెళ్తూ తన బుల్లెట్‌ను(ఏపీ39ఎస్ఎక్స్ 1418) బయట పార్క్ చేశాడు. మధ్యాహ్నం 2 గంటల ప్రాంతంలో ఫంక్షన్ ముగించుకుని వచ్చి చూడగా బుల్లెట్ కనిపించలేదు. దీనిపై భవానీపురం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు.

రేపు చిన్నయ సూరి జయంతి

భవానీపురం(విజయవాడపశ్చిమ): తెలుగు భాషకు ప్రామాణికమైన బాల వ్యాకరణ, నీతి చంద్రిక వంటి రచనల ద్వారా తెలుగు భాష వైభవానికి పునాది వేసిన పరవస్తు చిన్నయ సూరి 217వ జయంతి ఈ నెల 20వ తేదీన నిర్వహించనున్నట్లు పరవస్తు చిన్నయ సూరి సాహితీ పీఠం అధ్యక్ష, కార్యదర్శులు టి.శోభనాద్రి, ఎస్వీ శేషగిరిరావు ఒక ప్రకటనలో తెలిపారు. తొలుత తుమ్మలపల్లి కళాక్షేత్రంలోగల చిన్నయ సూరి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం బందరు రోడ్‌లోని ఠాగూర్ లైబ్రరీలో సాహితీ సభ ఏర్పాటు చేస్తామని చెప్పారు. తెలుగు భాషకు సేవలు అందిస్తున్న కవులు, రచయితలను సత్కరిస్తామన్నారు.

పోలీస్ స్పందనలో 72 ఫిర్యాదులు



విజయవాడ స్పోర్ట్స్: విజయవాడలోని జిల్లా పోలీస్ కమిషనరేట్‌లో సోమవారం నిర్వహించిన స్పందనలో 72 మంది బాధితుల నుంచి డీసీపీ విశాల్‌గున్ని, వి.అజిత ఫిర్యాదులు స్వీకరించారు. కుటుంబ కలహాలపై 10, నగదు లావాదేవీలపై 21, ఆస్తి వివాదాలపై 13, మోసాలకు సంబంధించి 13, ఇతర ఘటనలకు సంబంధించి 15 మంది ఫిర్యాదులు అందజేశారు. నిర్ణీత కాల వ్యవధిలో ఫిర్యాదులను పరిష్కరించాలని స్టేషన్ అధికారులను ఆదేశించారు.

వీఎంసీ స్పందనలో 11 అర్జీలు



పటమట(విజయవాడతూర్పు): స్పందనలో వచ్చే ఫిర్యాదులను త్వరితగతిన పూర్తిచేసి పరిష్కార సమాచారం అందించాలని అదనపు కమిషనర్ (జనరల్) శకుంతల, అడిషనల్ కమిషనర్ (ప్రాజెక్ట్స్) కేవీ సత్యవతి అన్నారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూంలో సోమవారం నిర్వహించిన స్పందనలో అధికారుల బృందంతో కలిసి అర్జీలు స్వీకరించారు. మొత్తం 11 అర్జీలు రాగా వాటన్నింటినీ వారంలోగా పరిష్కరించాలని ఆదేశించారు. ఇంజినీరింగ్ విభాగంపై -4, పట్టణ ప్రణాళిక విభాగం-4, రెవెన్యూ విభాగం-2, పట్టణ సాధికార విభాగం ప్రాజెక్ట్ అధికారికి ఒక అర్జీని స్వీకరించారు. చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి.రత్నావళి, సిటీ ప్లానర్ జీవీస్వీ ప్రసాద్, డెప్యూటీ కమిషనర్ (రెవిన్యూ) వెంకటలక్ష్మి, పట్టణ సాధికార విభాగం అధికారి రోహిణి, ఉద్యానవన విభాగం అధికారి శ్రీనివాస్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సర్వజనులకు యాగ ఫలాలు



అనుగ్రహ భాషణ చేస్తున్న శివాచార్య స్వామి



వల్లీదేవ సేనా సమేత సుబ్రహ్మణ్య స్వామి శోభాయాత్ర, కల్యాణం



స్వామి వారి కల్యాణం



కల్యాణోత్సంలో పాల్గొన్న దంపతులు



శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి

ముగిసిన వైభవ సుబ్రహ్మణ్య యాగం

విజయవాడ కల్చరల్: ధర్మరక్షకు కట్టుబడి ఉండాలని శివజ్ఞాన పీఠాధిపతి శివచార్య స్వామి భక్తులకు సూచించారు. శివజ్ఞానపీఠం ఆధ్వర్యంలో సంగీత కళాశాలలో నిర్వహిస్తున్న వైభవ సర్వ సుబ్రహ్మణ్య యాగం సోమవారం ముగిసంది. స్వామిజీ మాట్లాడుతూ ధర్మాన్ని మనం కాపాడితే ధర్మం మనలను కాపాడుతుందని తెలిపారు. యాగఫలాలు సర్వజనులకు అందించాలనే సంకల్పంతోనే కార్యక్రమాలకు రూపకల్పన చేసినట్లు చెప్పారు. ఆడిటర్ పెనుగొండ సుబ్బారాయుడు పీఠం నిర్వహిస్తున్న ఆధ్యాత్మిక కార్యక్రమాలను అభినందించారు. కార్యక్రమంలో చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కొనకళ్ళ విద్యాధరరావు, అర్బన్ ఆర్‌వైశ్య అధ్యక్షుడు పల్లపుట్టి మురళీ కృష్ణ తదితరులు పాల్గొన్నారు. ఉదయం నిత్యవిధి, చతుర్థకాల యాగ పూజ, సుబ్రహ్మణ్య షోడశ మూలమంత్రహోమం, సహస్ర రజిత సుబ్రహ్మణ్య వత్రం, పూర్ణాహుతి కార్యక్రమాలు స్వయంగా నిర్వహించారు. వల్లీ దేవ సేనా సమేత సుబ్రహ్మణ్యస్వామి ఉత్సవ మూర్తులతో శోభాయాత్ర నిర్వహించారు. వేద మంత్రాలతో స్వామి వారి కల్యాణం నిర్వహించారు. తీర్థ ప్రసాదాలను అందజేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నేత్రపర్వంగా సుబ్బరాయుని కల్యాణం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కొత్తపేట ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న సుబ్రహ్మణ్యేశ్వరస్వామి సన్నిధిలో కల్యాణోత్సవం సోమవారం రాత్రి నేత్రపర్వంగా నిర్వహించారు. సుబ్బరాయ షష్టిని పురస్కరించుకొని కలశ క్షీరాభిషేకం, ఏకదశ ద్రవ్య మహాభిషేకం వైభవంగా చేశారు. ఉదయం నుంచి రాత్రి వరకూ పలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం స్వామి వారి సన్నిధిలో సుప్రభాత సేవతో కార్యక్రమాలను ప్రారంభించారు. బాలసుబ్రహ్మణ్యేశ్వరునికి శతాధిక కలశ క్షీరాభిషేకం నిర్వహించారు. అనంతరం రాత్రి స్వామి వారి కల్యాణోత్సవం చేశారు. పెద్ద సంఖ్యలో పాల్గొన్న దంపతులతో స్వామి వారి శాంతి కల్యాణోత్సవాన్ని అర్చకులు నేత్రపర్వంగా జరిపారు. కార్యక్రమాలను ఆలయ కార్యనిర్వహణాధికారి ఎస్వీ సుబ్బారావు పర్యవేక్షించారు. భ్రమరాంబ మల్లేశ్వరస్వామి వారి దేవస్థానం (పాతశివాలయం)లో సుబ్బరాయ షష్టిని పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ఉపాలయంలో కొలువైన సుబ్రహ్మణ్యేశ్వరునికి ప్రత్యేక అభిషేకాలు చేశారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

వైభవంగా కల్యాణోత్సవం

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): చిట్టినగర్ సొరంగం కొండ ప్రాంతంలో వేం చేసిన శ్రీ వల్లీ దేవసేన సమేత కల్యాణ సుబ్రహ్మణ్య స్వామి కల్యాణోత్సవం సోమవారం వైభవంగా జరిగింది. ఆలయంలో తెల్లవారుజామున పంచామృత అభిషేకాలు, అర్చన, అనంతరం స్వామి వారిని పెళ్లికుమారుడిగా అలంకరించారు. పలువురు భక్తులు, ఉభయదాతలు పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణంలోని యాగశాలలో హోమాలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణం, సాధుజాన్ వీధిలో భక్తులకు అన్నప్రసాద వితరణ జరిగింది. కులమతాలకు అతీతంగా భక్తులు తరలివచ్చి స్వామి వారి అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. సాయంత్రం స్వామి వారికి ఊరేగింపు సేవ, పవళింపు సేవను దేవస్థాన వ్యవస్థాపక ధర్మకర్త తొత్తడి నాగరాజు దంపతులు జరిపించారు.

సౌత్‌జోన్ చాంపియన్‌షిప్ పోటీలకు ఎస్ఆర్ఆర్ విద్యార్థులు



సౌత్‌జోన్ చాంపియన్ పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్ డాక్టర్ భాగ్యలక్ష్మి

మధురానగర్(విజయవాడసెంట్రల్): కృష్ణా యూనివర్సిటీ అంతర్ కళాశాలల స్విమ్మింగ్ పోటీల్లో ఎస్ఆర్ఆర్ విద్యార్థులు బి.బాలగంగాధర్, పి.శరణ్‌చౌదరి సత్తాచాటి సౌత్‌జోన్ చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా కళాశాలలో నిర్వహించిన అభినందన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి వ్యాయామ అధ్యాపకులు ఎం.కోటేశ్వరరావు, డాక్టర్ డి.యుగంధర్‌లతో కలిసి సోమవారం విద్యార్థులను సత్కరించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ తమ కళాశాల విద్యార్థులు సౌత్‌జోన్ ఛాంపియన్‌షిప్ పోటీలకు ఎంపిక కావడం అభినందనీయమన్నారు. అలాగే తమ కళాశాలకు చెందిన హాకీ క్రీడాకారులు జి.సురేంద్ర, జి.గోపీకృష్ణ, కె.కార్తీక్‌కుమార్, మహమ్మద్ భాషా, కె.శివ కృష్ణా వర్శిటీ అంతర్ కళాశాల హాకీ టోర్నమెంట్‌లో అత్యుత్తమ ప్రదర్శనతో సౌత్‌జోన్ హాకీ టోర్నమెంట్‌కు వెళ్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కిక్ బాక్సింగ్ పోటీల్లో జంక్షన్ క్రీడాకారుల ప్రతిభ



పతకాలు సాధించిన టైగర్ పవర్ కిక్ బాక్సింగ్ అండ్ కరాటే స్కూల్ క్రీడాకారులు

హనుమాన్‌జంక్షన్ రూరల్: ఏపీ స్టేట్ కిక్ బాక్సింగ్ చాంపియన్‌షిప్-2023 పోటీల్లో హనుమాన్‌జంక్షన్‌కు చెందిన టైగర్ పవర్ కిక్ బాక్సింగ్ అండ్ కరాటే స్కూల్ క్రీడాకారులు 22 పతకాలతో సత్తా చాటారు. ఈ నెల 17వ తేదీన విశాఖపట్నం గాజువాకలోని అమరావతి పార్కులో జరిగిన ఈ రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా తరఫున 11 మంది టైగర్ పవర్ కిక్ బాక్సింగ్ అండ్ కరాటే స్కూల్ క్రీడాకారులు ప్రాతినిధ్యం వహించినట్లు కోచ్ కట్టా సుధాకర్ సోమవారం వివరించారు. పానుగంటి శివసాయి ఆశ్రిత్ (27 కిలోలు) కటాస్ విభాగంలో బంగారు, ఫైట్స్ విభాగంలో కాంస్య పతకం సాధించాడన్నారు. మత్తి హర్షిత (32 కిలోలు) కటాస్ విభాగంలో పసిడి పతకాన్ని సొంతం చేసుకోగా, ఫైట్స్ విభాగంలో వెండి పతకాన్ని సాధించిందని తెలిపారు. గొల్తి గోపిక (42 కేజీలు), మోటూరి సాహిత్య లక్ష్మి (43 కేజీలు) కటాస్ విభాగంలో వెండి పతకం, ఫైట్స్ విభాగంలో కాంస్య పతకాలను కైవసం చేసుకున్నట్లు చెప్పారు. కట్టా మనోజ్ (25 కేజీలు), ఆదివిష్ణు నీలమణికంఠ (55 కేజీలు), కొనకళ్ల లోకేష్ కుమార్ (55 కేజీలు), కాంచన శర్వానంద్ (44 కేజీలు), కొనకళ్ల హరిక ధనలక్ష్మి (70 కేజీలు), పిల్లి లావణ్య (26 కేజీలు), అడపా మేఘన శ్రీ హర్షిత (26 కేజీలు) కటాస్, ఫైట్స్ విభాగంలో కాంస్య పతకాలను సాధించినట్లు కోచ్ కట్టా సుధాకర్ తెలిపారు. రాష్ట్ర స్థాయిలో అత్యధిక పతకాలను సాధించిన జట్ల జాబితాలో కృష్ణాజిల్లా తరఫున ప్రాతినిధ్యం వహించిన టైగర్ పవర్ కిక్ బాక్సింగ్ అండ్ కరాటే స్కూల్ ద్వితీయ స్థానంలో నిలిచిందని వివరించారు. ఈ విద్యార్థులు వచ్చే ఏడాది జనవరి 3వ తేదీ నుంచి 6 వరకు ఢిల్లీలో జరగనున్న జాతీయ స్థాయి కిక్ బాక్సింగ్ పోటీలకు రాష్ట్ర జట్టు తరఫున పాల్గొననున్నట్లు తెలిపారు.

ఘనంగా ఆంధ్ర లయోలా వజ్రోత్సవం



కార్యక్రమానికి హాజరైన బిషప్ రాజారావు ఇతర గురువులు

గుణదల (విజయవాడ తూర్పు): దేశంలో విద్యావ్యాప్తి కోసం కతోలిక క్రైస్తవ సంస్థ విశేషమైన కృషి చేసిందని విజయవాడ కతోలిక పీఠం బిషప్ తెలగతోటి రాజారావు అన్నారు. ఆంధ్రా లయోల కళాశాల ప్లాటినమ్ జూబ్లీ వేడుకలు కళాశాల ఆవరణలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ సామాజిక సేవా కార్యక్రమాల్లో దశాబ్దాలుగా క్రైస్తవ సంస్థలు విశేషమైన కృషి చేస్తున్నాయని తెలిపారు. ముఖ్యంగా విద్యా, వైద్య రంగాల్లో కీలక పాత్ర పోషించాయని తెలిపారు. విద్యావ్యాప్తిలో లయోల సంస్థ నేటికీ తనదైన శైలిలో ముందుకు సాగుతోందని చెప్పారు. 1943 లో లయోల కళాశాల ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. ఆ నాటి నుంచి ఏడు దశాబ్దాలుగా లక్షలాది మంది విద్యార్థులకు విద్యాదానం చేసిన సంస్థగా లయోల కళాశాల ప్రఖ్యాతి చెందిందని వివరించారు. అనంతరం లయోల కళాశాల ప్రిన్సిపల్ ఫాదర్ జీఏపీ కిషోర్ మాట్లాడుతూ గుంటూరు బిషప్‌గా పనిచేస్తున్న ముమ్మడి ఇగ్నేషియస్ ఆలోచన ప్రకారమే 1943లో లయోల కళాశాలను ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. అప్పటి సంఘ సంస్కర్త కాట్రగడ్డ రఘురామయ్య సూచన ప్రకారం ఈ కళాశాలకు ఆంధ్ర లయోల కళాశాలగా పేరు పెట్టారని వెల్లడించారు. ఆ రోజుల్లో అనేక మంది తమ భూములను ఈ సంస్థకు విరాళంగా ఇచ్చారని తెలిపారు. కళాశాలలో చదువుకున్న వేలాది మంది విద్యార్థులు నేడు దేశ విదేశాల్లో ఉన్నత స్థాయిలో ఉన్నారని గుర్తు చేశారు. అనంతరం కళాశాల అభివృద్ధికి కృషి చేసిన గురువుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆంధ్ర, తెలంగాణ ప్రొవెన్షియల్ ఫాదర్ కె.స్టానిస్లాస్, లయోల కళాశాల ప్రస్తుత రెక్టర్ ఫాదర్ బాలశౌరి, కరెస్పాండెంట్ ఫాదర్ సహాయరాజ్, గుణదల పుణ్యక్షేత్ర రెక్టర్ ఫాదర్ యేలేటి విలియం జయరాజ్, కళాశాల అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

అయోధ్య అక్షింతలతో శోభాయాత్ర

గన్నవరం: శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర అభియాన్‌లో భాగంగా అయోధ్య నుంచి వచ్చిన పూజ అక్షింతలు సోమవారం మండలంలోని కేసరపల్లి శివారు శ్రీభువనేశ్వరీ పీఠంనకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా పీఠాధిపతులు కమలానందభారతి స్వామి నేతృత్వంలో అక్షింతలు నింపిన కలశాలతో శోభాయాత్ర నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో ఈ యాత్రలో పాల్గొని శ్రీరామజపం చేశారు. ఈ సందర్భంగా స్వామిజీ మాట్లాడుతూ ఈ నెల 20న గన్నవరం రోటరీ ఆడిటోరియంలో జరగనున్న హిందూ సమ్మేళనంలో అయోధ్య శ్రీరాముని అక్షింతలను గన్నవరం, ఉంగుటూరు, బాపులపాడు మండలాలకు చెందిన భక్తులు అందజేయనున్నట్లు తెలిపారు. హిందూ సమ్మేళనం మండల కనీవ్వనర్ వెలుగంటి శివాజీ, సభ్యులు ఎస్. శేషుకుమార్, జయశంకర్, పాండురంగారావు, భక్తవత్సల్యం, సురేష్, శ్రీనివాస్, అనిల్ పాల్గొన్నారు.

విద్యుత్ పొదుపుతో ఇంధనం ఆదా

ఉయ్యూరు: విద్యుత్ పొదుపుతో ఇంధన ఆదా అవుతుందని విద్యుత్ శాఖ ఉయ్యూరు ఈఈ కృష్ణనాయక్ అన్నారు. జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా సోమవారం విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో ఉయ్యూరు ఇంధన పొదుపుపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. విద్యుత్‌శాఖ కార్యాలయం నుంచి ప్రధాన సెంటరు వరకూ ర్యాలీ నిర్వహించి విద్యుత్ పొదుపుపై అవగాహన కల్పించారు. ఈఈ కృష్ణనాయక్ మాట్లాడుతూ భవిష్యత్తు తరాల కోసం ఇంధన పొదుపు చర్యలు చేపట్టాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. విద్యుత్ పొదుపు చర్యలతో ఇంధనం ఆదాతో పాటుగా ఆర్థిక భారం తగ్గుతుందన్నారు. కార్యక్రమంలో డీఈ ఎంవీవీ రామకృష్ణ, ఏఈలు నాగమల్లేశ్వరరావు, సత్యనారాయణ, సబ్ ఇంజినీర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అవ్వతాతలకు అండగా జగనన్న సర్కార్

డీసీఎంఎస్ చైర్‌పర్సన్ పడమట స్నిగ్ధ



గోసాల వృద్ధుల ఆశ్రమంలో కేక్ కట్ చేస్తున్న పడమట స్నిగ్ధ

పెనమలూరు: రాష్ట్రంలో అవ్వాతాతలకు అండగా జగనన్న నిలిచారని డీసీఎంఎస్ చైర్‌పర్సన్ పడమట స్నిగ్ధ అన్నారు. సోమవారం గోసాల గ్రామంలోని వృద్ధుల ఆశ్రమంలో వృద్ధుల సమక్షంలో కేక్‌కట్ చేసి వృద్ధులకు పంచిపెట్టారు. ఈ సందర్భంగా స్నిగ్ధ మాట్లాడుతూ జగనన్న అధికారంలోకి వచ్చిన తర్వాత అవ్వాతాతలకు భరోసా ఏర్పాడిందన్నారు. వృద్ధులకు వైఎస్సార్ పింఛన్ కానుక దశలవారీగా పెంచి జనవరి నాటికి రూ. 3 వేలు చేయబోతున్న ఘనత జగనన్నకు దక్కిందన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ కన్వీనర్ సంగెపు శ్రీనివాసరావు,ఏఎంసీ డైరెక్టర్ పోలవరపు రవి, నేతలు షేక్ పీర్‌అహ్మద్, షేక్ నాసర్, ఎండీ ఆసిఫ్, ఎండీ దాదా, భువనగిరి వెంకటరమణ, గోపాలరావు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో పర్యావరణ పరిరక్షణ



సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శనలో అధికారులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రకృతి వ్యవసాయంతో పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని, పంటలను ఆశించే చీడపీడలను సమర్థంగా ఎదుర్కోవచ్చని వ్యవసాయశాఖ డెప్యూటీ డైరెక్టర్ విజయకుమారి సూచించారు. స్థానిక మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం కళాశాల వృక్షశాస్త్ర విభాగం ఆధ్వర్యాన ఏపీ వ్యవసాయశాఖ సహకారంతో ప్రకృతి వ్యవసాయంపై విద్యార్థులకు వర్క్‌షాప్ జరిగింది. ముఖ్య అతిథి విజయకుమారి మాట్లాడుతూ.. సుభాష్ పాలేకర్ సూచించిన ప్రకృతి వ్యవసాయ పద్ధతులను పాటిస్తూ కంచెపంటలు, అంతర, ఆకర్షిత పంటలతో ఏడాది పొడవునా పొలాలను ఖాళీగా ఉంచకుండా సాగు చేయడం ద్వారా కర్బన ఉద్గారాలను తగ్గించొచ్చని సూచించారు. ఘన, ద్రవ జీవామృతాలను వాడుతూ దేశీ విత్తనాలతో సాగుచేయడం ద్వారా పంటలకు సహజ రోగ నిరోధక శక్తి సిద్ధిస్తుందన్నారు. సేంద్రీయ వ్యవసాయం వల్ల అనారోగ్య సమస్యలను సైతం తగ్గించొచ్చని పేర్కొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి, వృక్షశాస్త్ర విభాగాధిపతి ఎం.ఎస్.జి.స్వప్న మాట్లాడుతూ.. విద్యార్థి దశ నుంచే ప్రకృతి సేద్యంపై అవగాహన పెంచేందుకు ఈ వర్క్‌షాప్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఈ సందర్భంగా సేంద్రీయ వ్యవసాయ ఉత్పత్తులను ప్రదర్శించి వాటి ప్రయోజనాలను రైతులు వివరించారు. కళాశాల అధ్యాపకులు వి.నాగపద్మావతి, సీహెచ్ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

విజయవాడ వెస్ట్ :

90102 10386

Office mail : sakshiads@gmail.com